పేద రైతులకు భూహక్కు

● 746 మందికి భూపట్టాల పంపిణీ



తుగ్గలిలో శాశ్వత భూహక్కు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: దశాబ్దాలుగా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసి శాశ్వత హక్కులు కల్పిస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం తుగ్గలిలో కృష్ణగిరి, వెల్దుర్తి, మద్దికెర, తుగ్గలి మండలాలకు చెందిన 479.45 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 363 మంది రైతులకు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన 591.90 ఎకరాలకు సంబంధించి 383 మందికి పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి పేదవాడికి భూమి ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్న రైతులకు పట్టాలు పంపిణీ చేసి శాశ్వత హక్కులు కల్పించామన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ ప్రాంతం నుంచి డిప్యూటీ సీఎం పదవులు అలంకరించిన వారు సైతం నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ గ్రామాల్లో కక్షలు రేపేందుకు సిద్ధమైందని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం పాటుపడుతున్న వైఎస్ జగనన్నను మరోసారి అండగా నిలిచి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్, తహసీల్దార్లు రవి, రాజేశ్వరి, నాగభూషణం, విష్ణు, మద్దికెర జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర రెడ్డి, కృష్ణగిరి ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

మద్దికెర: మద్దికెరలోని సాయినగర్, రాంనగర్ కాలనీలు 30 ఏళ్లుగా నీటి సమస్యతో అల్లాడుతున్నాయని, ప్రస్తుతం తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.1.35 కోట్లతో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. గురువారం స్థానిక కాలనీలో ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కాలనీల ప్రజలు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టడమే గాకుండా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ సుహాసిని, మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పంచాయతీ సలహాదారుడు అంజనేయులు, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు, అగ్రహారం సర్పంచు విజేయుడు, ఆలూరు వెంకటేశ్వర రెడ్డి, ఎంపీటీసీ అంజనేయులు పాల్గొన్నారు.



మద్దికెరలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

నందవరం: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ సిబ్బందికి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ దశరథరామయ్య, హౌసింగ్ డీఈఈ ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జగనన్న కాలనీలో వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. థర్డ్ పార్టీ ఇళ్ల నిర్మాణాలు జనవరి 15 లోపు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తామన్నారు. హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

చిప్పగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమానికి మండలంలోని డేగులహాలు గ్రామంలో విశేష స్పందన లభించింది. గురువారం డేగులహాలు గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ సీపీ కొండయ్య ఆధ్వర్యంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు పరిశీలించి తగిన పరిష్కారం చూపుతామని ఎంపీపీఓ తెలిపారు. ఈఓఆర్డీ బాలన్న, ఏపీఎం నాగార్జున, ఏఈ భవ్య, పంచాయతీ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

దేవనకొండ: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్, వీఓఏలు సూచించారు. ఈ మేరకు గురువారం దేవనకొండలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో జెండర్, మహిళలకు సంబంధించిన విషయాలు, బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన కల్పించి, జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తేవాలని సూచించారు.

అవి-ఇవి

నేడు కృష్ణగిరికి ఎమ్మెల్యే రాక

కృష్ణగిరి: మత్స్య శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెనుమాడ చెరువులో చేప పిల్లలను విడుదల చేసేందుకు శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు తెలిపారు. అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

నేడు కార్యాలయాల ప్రారంభోత్సవం

తుగ్గలి: మండల పరిధిలోని శభాష్‌పురం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటించనున్నట్లు సర్పంచ్ పుష్పావతి, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, డీసీ కొండలో సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నీటి సమస్యకు పరిష్కారం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో సుంకులమ్మ దేవాలయం వద్ద రూ.21 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి సర్పంచ్ మల్లికార్జున గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీధిలో నీటి సమస్య ఉండటంతో ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయించారన్నారు. దీంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఉప సర్పంచు గోపాల్, నాయకులు దస్తగిరి గౌడు, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

కుల గణన పకడ్బందీగా చేపట్టాలి

నందవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథరామయ్య ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కుల గణనపై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. డిసెంబరు 10 నుంచి అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో సర్వే ప్రారంభమవుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దేవనకొండ: మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన రామాంజనేయులు కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. శ్రీ బ్రహ్మంగారి సేవా సమితి సభ్యులు గురువారం ఆ కుటుంబానికి రూ.13 వేలు నగదు ఇచ్చి మానవత్వం చాటుకున్నారు. వెలుగు సీసీ ఎం.నరసన్న, సీఆర్‌పీఎఫ్ బత్తిన సిద్ధప్ప, బీఎస్‌ఎఫ్ ముత్యాల మధుసూదన, తదితరులు ఉన్నారు.

మహిళాభ్యున్నతికే అర్బన్ మార్కెట్లు

ఎమ్మిగనూరుటౌన్: అర్బన్ మార్కెట్ల ద్వారా పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్కెట్‌ను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళలు స్వయంశక్తితో ఎదిగేలా ఆర్థిక సహాయం అందిస్తున్నారని, డ్వాక్రా రుణాలు సైతం అందిస్తున్నారని వివరించారు. మెప్మా సీఎంఎం జయవర్ధన్, మున్సిపల్ ఏఈ శరత్, సీఓలు పుష్ప, సువర్ణ, లలిత, కరుణ మ్మ., ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతి



హొళగుందలో కనకదాసు చిత్రపటం ఊరేగింపు

హొళగుంద: మండలంలో గురువారం కురువల ఆరాధ్య దేవుడు భక్త కనకదాసు 536వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హొళగుంద, కోగిలతోట, హెబ్బటం, ఎల్లార్తి, పెద్దహ్యాట, గజ్జహళ్లి, లింగంపల్లి, మార్లమడికి, నెరణికి తదితర గ్రామాలలో కనకదాసు చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. కోగిలతోటలో జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, కుటుంబ సభ్యులు జయంతి వేడుకలను జరుపుకున్నారు. అలాగే చిప్పగిరి జెడ్పీటీసీ, పంచాయతీరాజ్ జోనల్ వింగ్ చైర్మన్ విరుపాక్షి, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, ఆమె భర్త కృష్ణమోహన్ తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు. తన కీర్తనలు, పాటలతో ప్రజల్లో గూడుకట్టుకున్న అజ్ఞానాన్ని తొలగించిన మహా వ్యక్తి కనకదాసు అని వక్తలు కొనియాడారు. కురవలు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దినప్పుడే అన్ని రంగాల్లో ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కురువలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

కృష్ణగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని డైట్ లెక్చరర్ గోవిందు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం కంబాలపాడు, ఎరుకలచెర్వు, కృష్ణగిరి ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసిందని అందుకు తగిన రీతిలో విద్య బోధన అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్లే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. ఎంఈఓలు సునంద, మద్దయ్య, కాంప్లెక్స్ చైర్మన్లు కల్పన, వెంకటేశ్వర్లు, ఇమ్మాదుల్లా, ఆర్పీలు దుర్గప్రసాద్, తిప్పరాజు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



బోయ మంజునాథ్ (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో ఉరివేసుకుని బోయ మంజనాథ్(28) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం స్థానికులు తెలిపిన వివరాలు ఇవి.. గ్రామంలోని బోయ గోవిందు, వెంకటలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. అందులో చిన్న కుమారుడు బోయ మంజునాథ్ ఎమ్మిగనూరు టౌన్‌లో బట్టల దుకాణంలో పని చేసేవాడు. అనారోగ్య పరిస్థితుల కారణంగా పెళ్లి కాకపోవడంతో మనస్థాపం చెందాడు. బుధవారం రాత్రి షాపు నుంచి ఇంటికి వచ్చి గదిలో ఉరివేసుకుని బలవన్మరణం చెందాడు. ఉదయం కుటుంబ సభ్యులు గదిలో చూడగా ఉరివేసుకుని శవంగా కనిపించాడు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, నిందితులతో సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో అక్రమంగా కర్ణాటక మద్యం కలిగిఉన్న వ్యక్తులను పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, నిందితులను అరెస్ట్ చూయించారు. సెబ్ సీఐ జయరాంనాయుడు మాట్లాడుతూ పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో తనిఖీలు చేపట్టి మహమ్మద్ షఫివుల్లా, గద్వాల షమివుల్లా వద్ద ఐదు బాక్సుల్లోని 480 (90ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.30 వేలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. సీఐతో పాటు సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీ గోపాల్, లింగప్రసాద్, రబ్బానీ, పీసీలు రామచంద్రుడు, నరసింహారెడ్డి, ఇందుమతి తదితరులు ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బంగారమ్మ

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బంగారమ్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామ స్థాయిలో ప్రతి లబ్ధిదారునికి చేరాలనే ఉద్దేశంతో ఈ యాత్రను నిర్వహిస్తున్నారని చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందిస్తున్న 17 సంక్షేమ పథకాలను ప్రజలు తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారుంటే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించడమే వికసిత్ భారత్ లక్ష్యమని పేర్కొన్నారు. సర్పంచ్ ఆలీషా, ఈఓఆర్డీ విజయలక్ష్మి, ఎంఈఓ ఆంజనేయులు, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీవో విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయవాద వృత్తిలో రాణించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి దివ్య

పత్తికొండ రూరల్: న్యాయవాద వృత్తిలో రాణిస్తూ కక్షిదారులకు అంకిత భావంతో సేవలందించాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి దివ్య సూచించారు. గురువారం పత్తికొండ బార్ అసోసియేషన్‌లో నూతన న్యాయవాదులు ఉప్పర నాగరాజు, జూటూరు నాగభూషణం సభ్యత్వం తీసుకున్నారు. బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రంగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్జి హాజరై మాట్లాడారు. గౌరవప్రదమైన న్యాయవాద వృత్తిలోని చట్టాల గురించి తెలుసుకుని ప్రజలకు న్యాయ సేవలను అందించాలన్నారు. ప్రతిరోజు కోర్టుకు హాజరై కేసుల గురించి అధ్యయనం చేయాలన్నారు. బార్ అసోసియేషన్ కోశాధికారి మహేష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఎల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, ఈరన్న, మల్లికార్జున, సత్యనారాయణ, బాలబాష తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి ఎంపీడీఓగా రామస్వామి



కృష్ణగిరి: కృష్ణగిరి మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌చార్జ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రామస్వామి గురువారం పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ విశ్వమోహన్ అనారోగ్యంతో సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రామస్వామి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా రుద్రయజ్ఞం



వెల్దుర్తిలో కొనసాగుతున్న మహారుద్ర యజ్ఞం, హోమాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణంలోని రాజరాజేశ్వర స్వామి (పశువుల) దేవాలయంలో గురువారం మహారుద్ర యజ్ఞ, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యాపారవేత్త ప్రశాంత్‌కుమార్ నిర్వహణలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య లక్ష్మీగణపతి, రుద్ర, సుదర్శన, ఆదిత్య, నవగ్రహ, కాలభైరవ హోమాలు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. పరమేశ్వరుని ప్రీతిపాత్రమైన కార్తీకమాసాన ఆయన కరుణకటాక్షాలతో యజ్ఞంలో పాల్గొన్న 100 మంది దంపతులు, వారి కుటుంబాలు, భక్తులందరికీ శుభం చేకూరాలన్న ఆశాభావాన్ని నిర్వాహకులు వ్యక్తం చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



రూ.50 వేలు విరాళం అందిస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రం శివారులోని కడ్లమాగి రస్తా, పెద్ద చెరువు గట్టుపై వెలసిన గాయత్రి దేవి ఆలయ నిర్మాణానికి చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు, పంచాయతీరాజ్ జోనల్ వింగ్ చైర్మన్ విరుపాక్షి గురువారం రూ.50 వేలు విరాళం అందించారు. చెరువు గట్టుపై వెలిసిన దేవి ఆలయం చిన్నగా ఉండి శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామపెద్దలు నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనకు పూనుకున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి వచ్చిన విరుపాక్షికి తెలపగా ఆయన తనవంతుగా రూ.50 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కార్యాలయాల ప్రారంభోత్సవం



కారుమంచిలో నిర్మించిన గ్రామ సచివాలయం భవనం

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించేందుకు శుక్రవారం కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గ్రామానికి వస్తున్నట్లు సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చంద్రకళ తెలిపారు. అలాగే మంత్రి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారని, స్థానిక సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

పేదల అభ్యున్నతికి సీఎం కృషి



రాతనలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నలకదొడ్డిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా రూ.37.86 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తోన్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, మోహన్‌రెడ్డి, సర్పంచ్ రాచప్ప, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, మండల కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ హుసేన్, మోహన్‌రెడ్డి, సురేష్, కోదండ పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని జొహరాపురం సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్ నెల్లూరప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ సూర్య నరసింహా రెడ్డి మాట్లాడుతూ జొహరాపురం సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.30.96 కోట్లు అందించినట్లు వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, జేసీఎస్ మండల కన్వీనర్ బసవరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని కలుగొట్ల సచివాలయం–1లో సెక్రటరీ ఫాతిమా ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు ఆధ్వర్యంలో గ్రామ కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ పాలన వైఫల్యాలు, ప్రస్తుత ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. నాయకులు సీతారామిరెడ్డి, సురేశ్, జమీర్, విష్ణు, ఆర్ మద్దిలేటి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులతో గ్రామీణ వ్యవస్థ బలపడిందని ఎంపీపీ నారాయణదాస్ అన్నారు. గురువారం నలకదొడ్డి గ్రామంలో సర్పంచు రంజాన్ ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం నారాయణదాస్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామంలో జరిగిన సంక్షేమం పథకాలను వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఉరుకుందమ్మ, నాయకులు బాబుల్‌రెడ్డి, సోమశేఖర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని పార్టీ సీనియర్ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని కామినహాల్ గ్రామంలో 'ఏపీకి జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గ్రామంలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.17,13,02,606 మొత్తం అందించినట్లు వివరించారు. సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్ జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సర్పంచ్ పద్మజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–కన్వీనర్ జనార్ధననాయుడు, మండలాధ్యక్షుడు భీమప్పచౌదరి, ఎంపీటీసీ భారతి, ఎమ్మార్వో మల్లకార్జున స్వామి, ఎంపీడీఓ ఆంతోనీ, ఈఓపీఆర్డీ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



కలుగొట్లలో పార్టీ జెండావిష్కరణలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కామినహాల్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి

బండరాళ్లను తొలగిస్తే కఠిన చర్యలు

కర్నూలు (న్యూటౌన్): అనుమతులు లేకుండా బండరాళ్లను తొలగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం ఆయన దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ సమీపంలోని ఆచండకొండలో అక్రమంగా బండరాళ్లను తొలగిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేశారు. బండరాళ్లను తొలగిస్తే కేసులు నమోదు చేస్తామని అక్కడి వారిని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరమ్మ పూజలు



గూళ్యంలో హారతులతో పూజల్లో పాల్గొన్న చిన్నారులు

హాలహర్వి: మండలంలోని గూళ్యం, కామినహాల్, నిట్రవట్టి, సిద్ధాపురం, చింతకుంట, కామినహాల్ తదితర గ్రామాల్లో గురువారం గౌరమ్మ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలశాలు, చక్కెర హారతులతో గౌరమ్మ దేవి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు.

మోటార్ల ధ్వంసం చేసి కాపర్ చోరీ

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామానికి చెందిన రైతు షేక్ అబ్దుల్లా పొలంలోని విద్యుత్ మోటార్‌ను పగులగొట్టి అందులోని కాపర్ తీగను దుండగులు చోరీ చేశారు. వరి పంట చేతికి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇలాంటి చోరీలకు పాల్పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఘటనపై బాధిత రైతు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో.. వైడబ్ల్యూసీఎస్ మైదానంలో వేసిన బంకులను తొలగించాలని కోర్టు ఉత్తర్వులు తెచ్చినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విపక్ష సభ్యుడు చేసిన ఆరోపణలపై వైస్ చైర్మన్ స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మైదానంలో ఓ చివర బంకులను చేనేత సొసైటీ వారు ఏర్పాటు చేసి అద్దెకు ఇవ్వడం ద్వారా సొసైటీకి ఆదాయం సమకూర్చుకుంటున్నారన్నారు. మైదానంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని వివరించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. చేనేతల వ్యతిరేకిగా టీడీపీ వ్యవహరిస్తోందన్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలు పెరిగిపోవడంతో సభ ముగిసిందని చైర్మన్ ప్రకటించారు. అంతకు ముందు వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిపై బెదిరింపులు మానుకోవాలని సూచించారు. టేబుల్ అజెండాలోని 4 అంశాలతో పాటు అజెండాలోని 21 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. 27వ వార్డులో రూ.14 లక్షలతో న్యూ ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, 18వ వార్డులోని షాదీఖాన ఏరియాలో రూ.10 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం, చెన్నబసప్ప ఆయిల్ మిల్ ఏరియాలో రూ.8.16 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, అదేవార్డులో రూ.13 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సాధారణ నిధులు కేటాయించేలా ఆమోదించారు. పట్టణంలో నీలకంఠేశ్వర స్వామి జాతర పురస్కరించుకొని కార్ స్ట్రీట్‌లో గ్రావెల్ వేసేందుకు రూ.1.60 లక్షల కేటాయింపుతో పాటు పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ జన్మదినం పురస్కరించుకొని చైర్మన్ ఛాంబర్‌లో కేక్ కట్ చేయగా చైర్మన్, కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది కేక్ తినిపించారు. మున్సిపల్ డీఈ నీరజ, మేనేజర్ బేబి, టీపీఓ గోపాలకృష్ణ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం: బీఎల్‌ఓలు, ఎన్నికల సూపర్‌వైజర్లు తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, ఎన్నికల సూపర్‌వైజర్లు, సెక్టోరియల్ అధికారులతో తహసీల్దార్, ఎంపీడీఓ ఓటరు జాబితా పునఃపరిశీలనపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. డిసెంబర్ 2, 3వ తేదీలో నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలించి సమాచారం అందించాలన్నారు. ప్రత్యేక ఓటర్ల దినాలలో నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. మార్పులు, చేర్పుల కోసం వచ్చిన ఫారం–7, –8లపై ఎప్పటికప్పుడు విచారణ చేయాలన్నారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఎన్నికల సూపర్ వైజర్లు ఎంఈఓ–1 సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ–2 రఘునాథ్, ఏఓ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.